క్లుప్తంగా

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండలంలో సుప్రసిద్ధ శ్రీరామ కొండ క్షేత్రంలో సోమవారం మాఘ అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు రాఘవేందర్‌రావు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష అభిషేక అర్చన కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందిచినట్లు పురోహితులు తెలిపారు.

దాడితండాలో కంటి వెలుగు



దేవరకద్ర: మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని దాడితండాలో సోమవారం ఎంపీపీ రమాదేవి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సమీపంలో ఉన్న రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన క్యాంపులో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రతిభ, సూపర్‌వైజర్ భారతి, ఏఎన్‌ఎంలు పార్వతమ్మ, భాగ్యవతి, ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు ఈటల రాజేందర్ రాక

పాలమూరు: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహించే ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే కార్నర్ సమావేశానికి హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి కార్నర్ సమావేశం ప్రారంభం అవుతుందని, బీజేపీ శ్రేణులు అధికంగా తరలిరావాలని సూచించారు.

పశువైద్య శిబిరం..

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో మంగళవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ పుల్లారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధులు, సాధారణ చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగింపు సభ..

పాలమూరు: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో 54 గ్రామాల రైతులతో కలిసి నిర్వహిస్తున్న పాదయాత్ర మంగళవారం రామన్‌పాడు నుంచి ప్రారంభమై ఆత్మకూర్‌కు చేరుకుంటుందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూర్‌లో ముగింపు సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇథనాల్ కంపెనీ రద్దు చేయడంతో పాటు ప్రభుత్వాన్ని మోసం చేసిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్ ఖాతాలను అందించండి

జడ్చర్ల టౌన్: షెడ్యూల్ కులాల విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునేందుకు బ్యాంక్ ఖాతాలను ఉచితంగా ఇవ్వాలని అసిస్టెంట్ షోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం ఆమె తహసీల్దార్లు, బ్యాంక్ మేనేజర్లను కోరుతూ ప్రకటన విడుదల చేశారు. ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు కావాల్సిన ధ్రువపత్రాలు, బ్యాంక్ ఖాతాలు ఎలాంటి రుసుము లేకుండా అందించాలన్నారు. 5నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో దరఖాస్తు స్వీకరించాలని ప్రధానోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు జడ్చర్ల డివిజన్ పరిధిలోని 8మండలాల్లో 3,254 మంది విద్యార్థులకు గాను కేవలం 250 దరఖాస్తు మాత్రమే ఆన్‌లైన్‌లో అయ్యాయన్నారు. మిగిలిన వారితో త్వరగా దరఖాస్తులు స్వీకరించాలని ఆమె సూచించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనదారుడి కాలుపై నుంచి ఆటో వెళ్లి గాయపరిచిన ఘటనలో కేసు నమోదైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. టూ టౌన్ ఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1వ తేదీన చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్ దర్గా వద్ద బండమీదిపల్లికి చెందిన రాఘవేందర్‌చారి కాలుపై నుంచి ర్యాష్‌గా తీసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో రాఘవేందర్‌చారికి గాయాలయ్యాయి. బాధితుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్‌రెడ్డిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు

ప్రజా సేవకు జీవితం అంకితం

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు

భూత్పూర్: తన తండ్రి స్ఫూర్తితో.. నాయకులు, కార్యకర్తల ఆప్యాయతను చూసి రాజకీయాల్లోకి వచ్చానని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్త మొల్గరలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 2014, 2018లో మెజార్టీతో గెలిపించిన మండల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రజలతో మమేకంగా ఉంటూ వారి కష్టాల్లో తోడుగా ఉంటున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని పార్టీలకు అతీతంగా అందరికీ అందించి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక ముందు కూడా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి మరింత కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.

భోజనం వడ్డించిన ఆల దంపతులు..

ఆత్మీయ సమ్మేళనంలో 6వేలకు పైగా మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మంజుల దంపతులు ఆత్మీయంగా వారికి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నరసింహులు గౌడ్, అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భైరి ఇందిర మృతి సాహితీ రంగానికి తీరనిలోటు



మాట్లాడుతున్న కవి వెంకటేశ్వరశర్మ

చిన్నచింతకుంట: ఖమ్మం జిల్లా కొత్తగుడెంకు చెందిన కవయిత్రి భైరి ఇందిర మృతి సాహితీ రంగానికి తీరని లోటని ప్రముఖ గజల్ కవి ఇరివింటి వెంకటేశ్వర శర్మ అన్నారు. సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠశాలల ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. భైరి ఇందిర మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా కవి వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ గజల్ సాహిత్యానికి ఇందిర చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి సామాజిక కోణంలో రచనలు చేసిన గొప్ప కవి అని కొనియాడారు. కార్యక్రమంలో భాషోపాధ్యాయులు పల్లెర్ల రామోహన్‌రావు, కట్టా గిరిజా రమణశర్మ, పులి జమున, శ్యామ్ ప్రసాద్‌రావు, చక్రవర్తి గౌడ్, రామలింగం పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో క్యాంటీన్‌కు దరఖాస్తులు

పాలమూరు: స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒక సంవత్సరం పాటు కేఫ్టేరియా(క్యాంటీన్) నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తు తీసుకుంటున్నట్లు మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఫ్టేరియా నిర్వహించడానికి ఆసక్తి ఉన్న వారు మొదట కాలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ మహబూబ్‌నగర్ పేరిట రూ.2వేలను డీడీ రూపంలో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను షీల్డ్‌కవర్‌లో ఉంచి ఈనెల 25న మధ్యాహ్నం 3గంటలలోపు మెడికల్ కళాశాలలో అందించాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను ఈనెల 21 నుంచి 25వరకు ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పొందవచ్చునని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఈనెల 27న కేఫ్టేరియాను కేటాయించడం జరుగుతుందన్నారు.

నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారిద్దాం

అడ్డాకుల: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేద్దామని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మూసాపేట, అడ్డాకుల మండలాల్లో 44వ నంబర్ జాతీయ రహదారిని సోమవారం ఆమె పరిశీలించారు. ఇటీవల రహదారిపై ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించి రవాణాశాఖ, టోల్‌ప్లాజా అధికారులతో చర్చించారు. మూసాపేట మండలంలోని వేముల స్టేజీ వద్ద ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందిన ప్రదేశాలను పరిశీలించారు. అదేవిధంగా కందూర్ స్టేజీ, అడ్డాకుల వద్ద గోల్డెన్ హోటల్ సమీపంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రహదారి ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. వేముల స్టేజీ వద్ద ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చూడాలని పోలీసులకు సూచించారు. దీనికి రోడ్డు పక్కన ఉండే హోటళ్లు, షాపుల నిర్వాహకులు కూడా సహకరించాలని కోరారు. రాంగ్‌రూట్లో వెళ్లే వాహనాలను సీజ్ చేసి రవాణాశాఖ అధికారులకు అప్పగించాలని పోలీసులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఆదిత్య, ఎస్‌ఐలు నరేష్, విజయకుమార్, సంకలమద్ది సర్పంచ్ స్వరూప, టోల్‌ప్లాజా ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్, రూట్ ఆఫీసర్ రాకేష్, సిబ్బంది పరమేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా శకటోత్సవం



జడ్చర్ల టౌన్: మండలంలోని పర్వవేదీశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయం పరిసరాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు ట్రాక్టర్లను తీసుకువచ్చి ఊరేగింపు చేశారు. శకటోత్సవంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. మండలంలోని శివగిరిక్షేత్రం, చలమేశ్వర ఆలయాల్లోనూ శకటోత్సవం జరిపించి ఉత్సవాలు ముగించారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుడి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని జమిస్తాపూర్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి సమయంలో పార్వతీ పరమేశ్వరుడి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రిని పురస్కరించుకుని గ్రామంలో ఈదమ్మ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మొదటి రోజు ఉపవాసం, హోమంతో పాటు పార్వతీ పరమేశ్వరుడి కల్యాణం నిర్వహించారు. ఇక రెండో రోజు అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించడం, మూడోరోజు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోల ఊరేగింపు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రయ్య, ఉప సర్పంచ్ మొగులయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం..



నవాబుపేట: మండల కేంద్రంతో పాటు ఇప్పటూర్, కొల్లూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన శివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రత్యేక జలాలతో ముగిసాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కాశీనాథ ఆలయం, ఇప్పటూర్ శివాంజనేయ ఆలయం, కొల్లూర్ ఆంజనేయ శివాలయం, దొడ్డిపల్లి శ్రీరామ సహిత శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పూజారి రామేశ్వరయ్య, సర్పంచ్ గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, చంద్రశేఖర్, సుధాకర్‌చారీ, నర్సింహగౌడ్, శ్రీకాంత్, రాహుల్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేవరకద్ర నియోజకవర్గం అన్నసాగర్ నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, నాయకుడు కిల్లెగోపాల్ మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, రూ.10లక్షల ప్రమాద భీమా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి రూ.8,500ల వేతనం చెల్లించాలని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కురుమయ్య, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యుడి ఎంపికపై హర్షం

నవాబుపేట: ఏసీసీసీ సభ్యుడిగా మాజీ ఎంపీ, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే మల్లురవి ఎంపికపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రంగారావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అక్తర్, ప్రధాన కార్యదర్శి బంగ్లరవి, రాజేష్, ఎంపీటీసీ రాంచంద్రయ్య, తులసీరాం నాయక్, నీల్యానాయక్, రమేష్ తదితరులు హర్షం ప్రకటించారు.

జంగంరెడ్డిపల్లిలో శివాజీ ఫ్లెక్సీ దహనం



గండీడ్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో శివాజీ ఫ్లెక్సీని గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం యువకులు ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో రచ్చకట్ట వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఫ్లెక్సీ దహనమై కనిపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పట్టణానికి చెందిన బాణావత్ లలిత వైద్య ఖర్చుల కోసం పాలమూర్ అభివృద్ధి ఫోరం నాయకుడు మున్నూర్‌రవి ఆర్థికసాయం అందజేశారు. స్థానిక భగీరథ కాలనీలోని బంజార కాలనీలో నివాసం ఉన్న బాధితురాలి ఇంటికి వెళ్లి ఆర్థికసాయం అందజేశారు. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చుకు అవసరమయ్యే సహాయాన్ని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైత్రి యాదయ్య, విశ్వనాథ్ రావు, వెంకటేశ్, ఆంజనేయులు యాదవ్, మహేష్‌యాదవ్ ఉన్నారు.

నేడు సన్మానం

దేవరకద్ర: ఇటీవల కొత్తగా ఎన్నికైన మార్కెట్ పాలక మండలి కమిటీ సభ్యులకు మంగళవారం స్థానిక శ్రీనివాస గార్డెన్‌లో సన్మాన సభ జరుగుతుందని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం కార్యక్రమం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ పోస్టు స్థానికులకే ఇవ్వండి



ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని రెండవ అంగన్‌వాడీ సెంటర్ రామకొండకాలనీలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టును స్థానికులకే ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ మహిళలు ప్రజావాణిలో కలెక్టర్, ఐసీడీఎస్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడారు. స్థానికులకు ఉద్యోగం కాకుండా స్థానికేతరులకు చాకల్‌పల్లికి చెందిన కల్పనకు ఉద్యోగం ఇస్తున్నట్లు సమాచారం ఉన్నందునా అధికారులు మరోమారు విచారణ చేయాలని తెలిపారు. గ్రామస్తులైన కోడళ్లకు ఉద్యోగం ఇవ్వాలని వారు అధికారులతో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహేశ్వరి, పద్మ, తిరుపతమ్మ, లక్ష్మి, మంజుల, ప్రియాంక తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లడానికి కార్నర్ సమావేశాలు ఉపయోగించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి అన్నారు. పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పాన్ చౌరస్తా, సద్దలగుండు ఏరియాలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మచారి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో అవినీతి తారాస్థాయికి చేరిందని, మంత్రి ప్రభుత్వ కార్యాలయాలను ప్రైవేట్‌పరంగా చేస్తున్నాడని విమర్శించారు. పట్టణంలో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, జీవన్ జ్యోతి, సురక్ష పథకాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్పీ వెంకటేష్, అంజయ్య, పాండురంగారెడ్డి, నారాయణ, కృష్ణయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రాజాపూర్: రాష్ట్రంలో కుటుంబపాలన అంతమైతేనే ప్రజలకు విముక్తి లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ-భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లలో ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. మరోమోసం చేసేందుకు దళితబంధు తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్చర్ల ఇన్‌చార్జ్ బాలత్రిపురసుందరి, రాజాపూర్ మండల అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి, జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు నర్సింహులు, సాహితి, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం నుంచి వైదొలిగినప్పుడే దుర్మార్గపు పాలన అంతం అవుతుందని మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామచంద్రాపూర్‌లో సోమవారం కార్నర్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ఆరోపించారు. మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను కూడా వదలడం లేదని విమర్శించారు. పేద ప్రజలకు అండగా నరేంద్ర మోదీ ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. సమావేశంలో మండల ఇన్‌చార్జ్ పాండురంగారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, నాయకులు శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్, శాంతకుమార్, రాజు, లక్ష్మణ్, రామాంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయులు

రాజాపూర్: రైతులు సాగుచేసిన వరిపంటలను మొగి పురుగు ఎక్కువగా ఆశించి పంటలను పాడు చేస్తున్నదని జడ్చర్ల వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు రైతులకు సూచించారు సోమవారం మండలంలోని ఖానాపూర్‌లో రైతులు సాగు చేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలను రైతులకు వివరించారు. ముఖ్యంగా మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగిందన్నారు. జింక్‌లోపంతో పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నరెందర్, ఏఈఓలు శ్రీనివాస్, దీపికాగౌడ్, రైతులు బిక్కు మియా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: వరి సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ యశ్వంత్‌రావు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని శేరిపల్లి-బీలో వరి పంటలను ఆయన పరిశీలించారు. రైతులు ఎరువులు, పురుగు మందులు వ్యవసాయాధికారుల సూచన మేరకే వాడాలని తెలిపారు. అనంతరం పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, ఏఈఓ హర్ష ఉన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



వేములలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మిడ్జిల్: మండలంలోని వేములలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బండలాగుడు పోటీలను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా బండలాగుడు పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో మొదటి బహుమతి వనపర్తి జిల్లా గుమ్మడం గ్రామానికి చెందిన పరుషరాం నాయుడు వృషభరాజాలు రూ.40వేల మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి గద్వాల జిల్లా జమ్మిచేడ్‌కు చెందిన వెంకటేష్, తృతీయ బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరుకు చెందిన అరుణ్‌కుమార్, నాల్గవ బహుమతి తలకొండపల్లి మండలంలోని లింగరావుపల్లికి చెందిన హనుమాన్ బుల్స్, మిగతా వృషభరాజాల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీ శశిరేఖ, సర్పంచ్ జంగయ్య, ఎంపీటీసీలు యశోద, అభిమాన్యురెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పాలమూరు: ఈనెల 9నుంచి 12వరకు విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులను సోమవారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను సత్కరించారు. కార్యక్ర మంలో క్లబ్ ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ, అధ్య క్షుడు అబ్దుల్ రహమాన్, చైర్మన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దగుండ్లతండాలో కేంద్ర బృందం పర్యటన



హరితహారం మొక్కలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మిడ్జిల్: మండలంలోని పెద్దగుంట్ల తండా పంచాయతీ పరిధిలో హరితహారంలో భాగంగా ఎన్‌ఈఆర్‌ఈజీఎస్ నిధులతో నాటిన చెట్లను సోమవారం కేంద్ర బృందం సభ్యులు కృష్ణమూర్తి, ఆడిటర్ ముకులానంద్ పరిశీలించారు. మొక్కల సంఖ్యను లెక్కించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, ఏపీఓ రాజేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.